ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com


నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -143 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 30 జూన్ 2026

# రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి






**దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి**

**హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి**

**ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం**

**నిర్మాణ సంస్థలతో సిఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి, జూన్ 29 ఆంధ్ర ప్రగతి**

యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి **మిగతా 2లో...**

## తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది



**: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్**

**తెలంగాణలో త్వరలో బీజేపీ ప్రభుత్వం ఖాయమన్న నితిన్ నబిన్**

**బెంగాల్ తరహాలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని శ్రేణులకు పిలుపు**

**అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని వ్యాఖ్య**

**హైదరాబాద్, జూన్ 29 ఆంధ్ర ప్రగతి**

తెలంగాణలో త్వరలోనే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కమలం వికసించడం ఖాయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. **మిగతా 2లో...**

## లొంగిపోయిన హెడ్ కానిస్టేబుళ్లు

**గాదె సాయికృష్ణ మృతి కేసు**



**అమరావతి, జూన్ 29 ఆంధ్ర ప్రగతి**

గాదె సాయికృష్ణ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న అశోక్, నాని సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయానికి వచ్చి లొంగిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజుకు వీరిద్దరూ వెన్నంటి ఉండేవారు. సాయికృష్ణ మృతి వ్యవహారంలో అశోక్, నాని ఆయనకు సహకారం అందించినట్లు సిట్ గుర్తించింది. నాగరాజు అరెస్ట్ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన వారిద్దరూ నేడు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కృష్ణలంక స్టేషన్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు, లాడ్జీలు.. ఇతరత్రా కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాలను అశోక్ చక్కదిద్దేవాడు. పలు సెటిల్మెంట్లకు పాల్పడేవాడని ఆరోపణలున్నాయి. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులతో సఖ్యంగా ఉండటం, బెదిరింపులకు పాల్పడటం, నేరస్థులను స్టేషన్‌కు తీసుకురావడం వంటి పనులను నాని చేసేవాడు. నాని పటమట స్టేషన్‌లో పనిచేసినప్పుడు స్పా సెంటర్ల విషయంలో **మిగతా 2లో...**

## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

**అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం**


**ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్**

**భారత్‌లో కే-డ్రామాల ఆదరణతో సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం**

**కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి**

**హైదరాబాద్, జూన్ 29 ఆంధ్ర ప్రగతి**

ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్ కల్చరల్ సెంటర్ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. **మిగతా 2లో...**



## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

**'షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో మంత్రి లోకేశ్**

**టెన్త్, ఇంటర్ షైనింగ్ స్టార్లకు నగదు పురస్కారాలు అందచేత**



**అమరావతి, జూన్ 29 ఆంధ్ర ప్రగతి**

"మీరు కష్టపడి చదవండి.. విద్యాశాఖ మంత్రిగా మీ కలలను సాకారం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన **మిగతా 2లో...**

## ముఖం చాటేసిన నైరుతి

**దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు**

**ఏరువాక సాగక రైతన్న ఆందోళన**

**న్యూఢిల్లీ,, జూన్ 29ఆంధ్ర ప్రగతి**

:దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. **2లో...**



## కూటమి కృషితో సీమకు మహర్దశ

**జగన్ హయాంలో రక్తపుటేరులు పారించారు**

**ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్య**



**2లో.**

## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్యదినోత్సవం

**ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోడీ**

**విక్టోరియా,, జూన్ 29 ఆంధ్ర ప్రగతి**

భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. **మిగతా 2లో...**




## అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

**అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరణ**

**అంత తొందరెందుకని పిటిషన్‌కు ధర్మాసనం ప్రశ్న**

**న్యూఢిల్లీ,, జూన్ 29 ఆంధ్ర ప్రగతి**

అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు జరిగేలా **మిగతా 2లో...**



# రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

మొదటిపేజీ తరువాయి

చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

# ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

మొదటిపేజీ తరువాయి

ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సాగింది.

ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'డ్రీమ్ వాల్స్', 'గ్రాటిట్యూడ్ వాల్స్'పై విద్యార్థులు రాసిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని లోకేశ్ తెలిపారు. విద్యార్థులు అద్భుతమైన సలహాలు ఇచ్చారని, వారిలో కొంతమంది అయినా రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. తాను రాజకీయాల్లో ఉండటం వల్లే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విద్యా సంస్కరణలు ఏపీలో తీసుకురాగలుగుతున్నానని అన్నారు.

**త్వరలో ఏఐ ట్యూటర్.. బలోపేతం కానున్న గ్రంథాలయాలు**

వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఆకాంక్షలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాకినాడకు చెందిన క్రాంతి అనే విద్యార్థి స్కూలు స్థాయి నుంచే కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై శిక్షణ, మోటివేషన్ క్లాసులు, లైబ్రరీల అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని, పుస్తకాలు చదవడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు.

మండలం, నియోజకవర్గం, జిల్లా, జోనల్ స్థాయిలో లైబ్రరీలను బలోపేతం చేస్తామని, ఏడాదిలోగా అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని హామీ ఇచ్చారు. మరో విద్యార్థిని అన్నపూర్ణేశ్వరి ఎన్‌సీసీ, కంప్యూటర్ ల్యాబ్ కావాలని కోరగా, త్వరలోనే రాష్ట్రంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నామని, అలాగే ఏపీకి ప్రత్యేకంగా ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్‌ను కేంద్రం మంజూరు చేసిందని శుభవార్త తెలిపారు.

**విద్యార్థుల భావోద్వేగ కథలు.. మంత్రి భరోసా**

కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ వ్యక్తిగత కష్టాలను, ఉన్నత లక్ష్యాలను పంచుకున్నారు. కదిరికి చెందిన షేక్ చాందిని, ఇంటర్‌లో 1000కి 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచానని, తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతున్నారని, ఆయన కోసమే కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నానని తెలిపింది. నీట్ కోసం కోచింగ్ ఇప్పించాలని కోరగా, అందుకు పూర్తి సహాయం అందిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

టెక్కలికి చెందిన అనన్యశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిణిగా విజన్ 2047 సాధనకు కృషి చేస్తానని చెప్పింది.

ఆత్మకూరుకు చెందిన షేక్ అనీషా, పాఠశాల స్థాయి నుంచే పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వాలని కోరగా, రాబోయే ఐదేళ్లలో 10, 11, 12 తరగతుల విద్యార్థులు చదువుతో పాటు కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళిక రచిస్తామని లోకేష్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా విద్యార్థి పవన్ సాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కోరగా.. రాబోయేది ఏఐ విప్లవమని, పాఠశాల స్థాయి నుంచే ఏఐ ల్యాబ్స్, ఫండమెంటల్స్‌పై శిక్షణ ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**చదువు మధ్యలో ఆగకూడదు.. అండగా ఉంటా**

అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మనీష, తన తండ్రి చదివించలేని పరిస్థితుల్లో ఉన్నారని కన్నీటిపర్యంతమవ్వగా, మంత్రి లోకేష్ చలించిపోయారు. "ధైర్యంగా ఉండు, నీ చదువుకు నేను సాయం చేస్తా" అని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆపకూడదనేదే తన లక్ష్యమని, అలాంటి వారిని గుర్తించి చేయూతనిస్తామని చెప్పారు.

ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యం అనే విద్యార్థిని, చిన్నతనంలోనే పెళ్లయినా ఆరేళ్ల తర్వాత మళ్లీ చదువు ప్రారంభించి ఒకేషనల్ కోర్సులో 990 మార్కులతో టాపర్‌గా నిలిచానని, ఇప్పుడు డిగ్రీ చదవాలని ఉందని చెప్పగా, ఆమెకు కూడా సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా, తాను ఎప్పుడూ బట్టీ కొట్టలేదని, తన బలం అప్లికేషన్, ఎగ్జిక్యూషన్, క్రిటికల్ థింకింగ్ అని లోకేశ్ తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకున్నారు.

శంఖవరం విద్యార్థిని స్వాతి తన గ్రామంలోని రోడ్డు దశాబ్దాలుగా అధ్వానంగా ఉందని చెప్పగా, మూడు నాలుగు నెలల్లో రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చారు. విద్యార్థులకు శారీరక విద్యతో పాటు మానసిక ఆరోగ్య అవగాహన కూడా కల్పించాలని విశాఖ విద్యార్థి శ్రీహర్ష చేసిన సూచనను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమం కేవలం సత్కారాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలకు, ప్రభుత్వ విధాన రూపకల్పనకు వారధిగా నిలిచింది.

# తెలంగాణలో త్వరలో కమలం వికసిస్తుంది

మొదటిపేజీ తరువాయి

ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆయన శంషాబాద్‌లో రంగారెడ్డి రూరల్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనితో పాటు మరో తొమ్మిది జిల్లాల కార్యాలయాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కనబరిచిన పోరాట పటిమను తెలంగాణలోనూ పునరావృతం చేయాలని సూచించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అరాచక పాలన సాగిస్తోందని నితిన్ నబిన్ ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడంలో బీజేపీ కీలక పాత్ర పోషించగా, ఆ ఫలితాన్ని కాంగ్రెస్ తనకనుకూలంగా మార్చుకుని లబ్ధి పొందిందని ఆయన వ్యాఖ్యానించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గల్లీ, మొహల్లాకు పార్టీ సిద్ధాంతాలను, ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ 'డబుల్ ఇంజిన్' సర్కారు ఉంటేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

అంతకుముందు, శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నితిన్ నబిన్‌కు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర బీజేపీ నేత ఎన్. రాంచందర్ రావు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన బూత్ అధ్యక్షుల 'విజయ్ సంకల్ప్ సమ్మేళనం'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

# జర్నలిస్ట్ ల సొంత ఇంటి కల... ఇక నెరవేరేనా..?

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 29:**

సమాజంలో ప్రతి ఒక్కరి సమస్యలపైనా కలం ఝుళిపించే జర్నలిస్టుల సొంతింటి కల... కలగానే మిగిలిపోనుందా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా, మీడియా మిత్రుల మదిలో మెదులుతున్న సందేహాలకు సమాధానం దొరికేనా? గత ప్రభుత్వ హయాంలో "ఇక అంతా పూర్తయింది... ఇళ్ల స్థలాలు చేతికి వస్తాయి" అని సంతోషపడే లోపే... ఎన్నికల కోడ్ రూపంలో జర్నలిస్టుల




ఆశలపై నీళ్లు చల్లబడ్డాయి. మరి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆ శ్రీకారం చుడుతుందా... లేదా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది!

**నంద్యాలకు దక్కిన ప్రాధాన్యత... మరి జర్నలిస్టుల సంగతేంటి.?**

విశేషం ఏంటంటే... నంద్యాల జిల్లాకు రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రత్యేక ప్రాతినిధ్యం ఉంది. స్థానిక మంత్రి వర్యులు నంద్యాల నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్న మంత్రి గారు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను, ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యపై ఎందుకు దృష్టి సారించడం లేదనే చర్చ నడుస్తోంది.

అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, జర్నలిస్టుల సంక్షేమం, ముఖ్యంగా వారి సొంతింటి కల నెరవేర్చేందుకు స్థానిక మంత్రి వర్యులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు మీడియా ప్రతినిధులు.ఇదే సమయంలో జర్నలిస్టు సంఘాల నేతల తీరుపై కూడా క్షేత్రస్థాయిలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో ఇళ్ల స్థలాల కోసం రాత్రింబవళ్లు శ్రమించిన నేతలు... ఇప్పుడు ఎందుకు మిన్నకుండిపోయారు.? ప్రభుత్వ పెద్దల వద్దకు వెళ్లి, నంద్యాల మంత్రి గారిని కలిసి జర్నలిస్టుల సమస్యను కార్యరూపంలోకి తీసుకురావడానికి ఎందుకు చొరవ చూపడం లేదు.?

ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన ప్రక్రియను రీ-ఓపెన్ చేయించి, మీడియా మిత్రులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత సంఘాల నేతలపై లేదా? అని జర్నలిస్టు లోకం ప్రశ్నిస్తోంది. జస్ట్ ఆస్కింగ్!

పగలు, రాత్రి అహర్నిశలు కష్టపడుతూ... సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే జర్నలిస్టుల కుటుంబాలకు ఒక సొంత ఇల్లు అనేది ఒక భావోద్వేగమైన కల. మరి ఇప్పటికైనా నంద్యాల మంత్రి గారు, అలాగే జర్నలిస్టు సంఘాల నేతలు స్పందించి కూటమి ప్రభుత్వం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తారో లేదో చూడాలి.

# అయోధ్య రామాలయ నిధుల దుర్వినియోగం

మొదటిపేజీ తరువాయి

ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే ఈ పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరించింది. అయోధ్య రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, రామమందిర విరాళాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంపై సీబీఐతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోర్టును కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోందని, అందుకే స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన వాదించారు. ఇక, కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కోర్టు, మెన్షన్ స్లిప్ సర్క్యులేట్ చేయాలని సూచించింది. అయితే

ఈ కేసులో వెంటనే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమైన వెంటనే ఈ కేసును లిస్ట్ చేసి విచారణ చేపడతామని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం ఈ అంశంపై అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈలోపే మిన్ను విరిగి మీద పడదు.. అంత తొందరెందుక'ని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మరోవైపు, ఈ కేసులో నిందితుల పక్షాన ఎవరూ వాదించొద్దని ౹÷జాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. 'ఈ కేసులో నిందితుల తరఫున ఎవరూ వాదించరు. ఒకవేళ ఎవరైనా అలా చేస్తే.. క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి రూ.5లక్షలు జరిమానా విధిస్తాం' అని అసోసియేషన్ అధ్యక్షుడు కలికా ప్రసాద్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. 2005లో కూడా అక్కడి న్యాయవాదులు ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారు. ఆ ఏడాది రామ మందిరంపై దాడికి పాల్పడిన నిందితులను ఫైజాబాద్ కోర్టు ముందు హాజరుపర్చగా.. వారి పక్షాన వాదించేందుకు ఎవరూ ముందుకురాలేదు.

# కూటమి కృషితో సీమకు మహర్దశ

## జగన్ హయాంలో రక్తపుటేరులు పారించారు

## ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్య

**అమరావతి, జూన్ 29ఆంధ్ర ప్రగతి** కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్యానించారు. అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారని పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష హోదా దక్కని వాళ్లు కూడా సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రప్పా, రప్పా అంటే పారిశ్రామికవేత్తలు వస్తారా...? అని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఉన్న పరిశ్రమలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రాయలసీమలో రక్తపుటేరులు పారించారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి జనార్దనరెడ్డి మీడియాతో మాట్లాడారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు రాయలసీమకు వస్తున్నాయని వివరించారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి డిపాజిట్‌లు కూడా రావని మంత్రి బీసీ జనార్దనరెడ్డి విమర్శించారు.

# తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు. భారత్‌లో, ముఖ్యంగా యువతలో కొరియన్ కే-డ్రామాలు, కొరియన్ వినోద కార్యక్రమాలకు ఓటీటీ వేదికల ద్వారా విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక అనుబంధం తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు కళలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, సృజనాత్మక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, సృజనాత్మక పరిశ్రమల రంగాల్లో కొరియాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వారసత్వ పరిరక్షణ, పర్యాటక ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో కిమ్ కాంగ్‌హున్ (హెడ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్, ఐఅఅఎ), ఇమ్ హ్యిజే (హెడ్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, ఐఅఅఎ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి పాల్గొన్నారు.

-----

# లొంగిపోయిన హెడ్ కానిస్టేబుళ్లు

మొదటిపేజీ తరువాయి

ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపించారు. గన్నవరం స్టేషన్‌లో పనిచేసినప్పుడు ఓ మిస్సింగ్ కేసులో ఆత్కూరు స్టేషన్ ఎస్సైని అని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో సస్పెండయ్యాడు. సీఐ నాగరాజుకు సన్నిహితంగా మెలిగిన ప్రైవేటు వ్యక్తి సురేష్ కూడా వీరితో కలిసి రౌడీషీటర్ల కౌన్సెలింగ్, నిందితుల విచారణ, తదితర వ్యవహారాల్లో జోక్యం చేసుకునేవాడని తేలింది. గత నెల 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు ఈ ముగ్గురూ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వెళ్లారని సిట్ అధికారులు గుర్తించారు. సురేష్‌ను సిట్ ఇప్పటికే అదుపులోకి తీసుకుంది.

# ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్యదినోత్సవం

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గో÷-డలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# ముఖం చాటేసిన నైరుతి

మొదటిపేజీ తరువాయి

మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది. గుజరాత్ 86 శాతం వర్షపాతలోటుతో ఉండగా, మహారాష్ట్రలో 60 శాతం లోటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 42 శాతం, యూపీలో 59 శాతం, బీహార్‌లో 52 శాతం, ఒడిశాలో 53 శాతం, తెలంగాణలో 32 శాతం, కర్ణాటకలో 47 శాతం వర్షపాత లోటు రికార్డయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ.. ఎల్ నినో ప్రభావం వల్ల చాలాప్రాంతాల్లో చినుకుజాడ కరువైంది. వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరుగుతున్నది. జూన్ 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, తర్వాత స్తంభించిపోయాయి. దేశంలోని చాలాప్రాంతాల్లో 40 శాతం తకువ వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంతసమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాతావరణంలో తేమ శాతం పెరుగడం వల్ల, సుదీర్ఘ పొడికాలం తర్వాత అకస్మాత్తుగా కురిసే భారీవర్షాలు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 8.35 సెం.మీ., కరీంనగర్ జిల్లా రామడుగులో 6.94 సెం.మీ., కరీంనగర్ రూరల్‌లో 6.15 సెం.మీ., జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో 5.20 సెం.మీ., మెట్‌పల్లిలో 4.31 సెం.మీ., కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5.20 సెం.మీ., సూర్యాపేట జిల్లా మద్దిరాళ్లలో 4.09 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదయినట్టు అధికారులు తెలిపారు.

# ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను 5రోజుల్లోపు పూర్తిచేయాలి.

..ప్రజలకు మంచి సేవలందించి సానుకూల ప్రజాభిప్రాయం పెంపొందించేలా కృషి చేయాలి.

..ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు.

..ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి.

..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 29:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను 5రోజుల్లోపు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పిజిఆర్ఎస్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతి ఆదేశాన్ని, ప్రతి గడువును ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు. వారు ఇచ్చిన టైమ్‌టేబుల్ ప్రకారం ఏ నివేదికను ఏ రోజు, ఏ సమయానికి సమర్పించాలో, అదే రోజు, అదే సమయానికి సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన పనుల్లో మాత్రం ఎలాంటి నిర్లక్ష్యానికీ అవకాశం ఉండకూడదన్నారు.. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ పనిని చాలా వరకు సమర్థవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి శాతం తక్కువగా ఉందని, శనివారంలోపు ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌లో ప్రతిరోజూ కనీసం 10 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్ ఈ ఆర్వో లు, ఏ ఈ ఆర్వో లను ఆదేశించారు.. నిరంతరం బి ఎల్ వో లతో సమీక్షిస్తూ, పురోగతి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ కు సంబంధించి అన్ని శాఖల అధికారులు ప్రజలకు మంచి సేవలందించి సానుకూల ప్రజాభిప్రాయం పెంపొందించేలా కృషి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.. రెవెన్యూ, సర్వే, డీపీఓ, జీఎస్‌డబ్ల్యూఎస్, డీఆర్డీఏ, డిటిసి, సంక్షేమ వసతి గృహాలు, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ డబ్ల్యూ ఎస్, హార్టికల్చర్, దీపం, స్వర్ణ గ్రామం,స్వర్ణ వార్డు తదితర శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి శాఖ తమ పనితీరును ప్రస్తుతం ఉన్న శాతం నుండి కనీసం 10 శాతం మెరుగుపరచి, ప్రజల సంతృప్తి స్థాయిని 80 శాతానికి పైగా తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. హార్టికల్చర్ శాఖకు సంబంధించి సాగునీరు అందుబాటులో ఉన్న భూముల్లో ఉద్యాన పంటల విస్తరణ పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, నీటిపారుదల సౌకర్యం ఉన్న భూముల్లో ఉద్యాన పంటల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ జిల్లా ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు.
పిజిఆర్ఎస్ కు సంబంధించి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు, ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లు సమన్వయంతో పనిచేసి ఫిర్యాదులను నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాలన్నారు. గత రెండేళ్లుగా పీజీఆర్ఎస్ విధివిధానాలు పై పలుమార్లు శిక్షణలు, సూచనలు ఇచ్చినప్పటికీ ఇంకా నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. 40 రోజుల ఎస్సీఎల్ఏ గడువులో చివరి రోజుల్లో మాత్రమే ఫిర్యాదులను తెరిచి, సంబంధం లేని ఎండార్స్‌మెంట్‌లతో మూసివేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ సర్వేయర్లు నోటీసులు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకపోవడం, సర్వే అనంతరం నివేదికలను సమర్పించకపోవడం వంటి అంశాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ పరిస్థితిని ఇకపై సహించబోమని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.పీజీఆర్ఎస్, భూ రికార్డుల నిర్వహణ లో జిల్లా పనితీరు మెరుగుపడేలా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే తహసీల్దార్లు, వీఆర్ఓలు తదితర అధికారులపై చర్యలకు సంబంధించిన ఫైళ్లను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ డీఆర్ఓను ఆదేశించారు.. ప్రతిరోజూ కొత్తగా వచ్చిన ఫిర్యాదులు, ఎూూ గడువులో ఉన్న కేసులను పరిశీలించి, అదే రోజు వాటిని ఓపెన్ చేసి సంబంధిత పిటిషనర్‌తో మాట్లాడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత , అనురాధ, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతను ఆదుకుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది.

..రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి - సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్





**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు జూన్ 29:**
ఏరువాక పౌర్ణమి సందర్భంగా సోమవారం నందికొట్కూరు పట్టణంలోని సవారమ్మ గుడి సమీపంలోని వ్యవసాయ పొలాలను సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు సందర్శించి, రైతులతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాగరికత ఎంత అభివృద్ధి చెందినా వ్యవసాయానికి ప్రత్యామ్నాయం లేదని, రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఏరువాక పౌర్ణమి అనేది రైతులు భూమాతను ఆరాధిస్తూ సమృద్ధిగా పంటలు పండాలని, అన్నదాతల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించే పవిత్రమైన పండుగ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏరువాక పౌర్ణమి వేడుకలను అధికారికంగా నిర్వహించడం స్వాగతించదగినదేనని, అయితే ఆర్భాట కార్యక్రమాలకు భారీగా ప్రజాధనాన్ని వెచ్చించే బదులు అదే నిధులను ఖరీఫ్ సీజన్‌లో రైతులు, కౌలు రైతులకు ఉపయోగపడే విధంగా రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీకి వినియోగిస్తే మరింత ప్రయోజనం చేకూరుతుందని సూచించారు.మొక్కజొన్న, పత్తి, మిరప, ఉల్లి, సోయాబీన్, పెసర, మినుము తదితర పంటలకు కనీసం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తే రైతులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.
గత ఏడాది మొక్కజొన్న పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులు, దళారుల చేతిలో తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడం రైతులపై అదనపు భారం మోపుతోందన్నారు.
అలాగే ఎరువుల పంపిణీని పూర్తిగా ఆన్‌లైన్ యాప్ ద్వారా పంట నమోదు ప్రక్రియతో అనుసంధానించడం వల్ల రైతులు రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒక ఎకరానికి కేవలం 25 కిలోల డీఏపీ కేటాయించడం వల్ల ఆశించిన దిగుబడి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రైతులకు అవసరమైన మేరకు నాణ్యమైన ఎరువులు అందించడంతో పాటు గతంలో అమలులో ఉన్న సులభమైన పంపిణీ విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ, అఖిల భారత కిసాన్ మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వడ్డే శ్రీరాములు, వేల్పుల ఏసన్న, రైతులు శ్రీనివాసరెడ్డి, రాజు, పార్టీ జిల్లా నాయకులు పీ. మాధవ నాయుడు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా సత్వరమే పరిష్కరించాలి.

..పీజీఆర్ఎస్‌లో 304 ప్రజా దరఖాస్తుల స్వీకరణ. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 29:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారం అందించాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించినప్పటికీ తిరిగి రీఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖలు నాణ్యమైన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికకు సంబంధించిన అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తగిన ఎండార్స్‌మెంట్‌తో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 148 అర్జీల స్వీకరణ.**

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించే అవకాశాన్ని ఈ క్లినిక్‌లు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 148 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 3, అడంగల్ సవరణలకు సంబంధించినవి 4, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఏ భూములకు సంబంధించినవి 10, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 34, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 59, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 32, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 6 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు. పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన కొన్ని ముఖ్య అర్జీలు 1)బండి ఆత్మకూరు మండలం: భాస్కర్ రావు తన సర్వే నంబర్ 277/2 ఏ లో 1.30 విస్తీర్ణంగాల భూమిలో 0.9 సెంట్లు తక్కువగా ఉన్నది సర్వేయర్ ద్వారా కొలతలు వేసి ఇప్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
2) ఆత్మకూరు మండలం: బిజీ వసుంధర, ఆత్మకూరు మండలం 1105 సర్వే నంబర్లు గల విస్తీర్ణం గల 2.3 ఎకరాల నా భూమిని అక్రమంగా ఆక్రమించి డబల్ రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. కావున నాయదు దయవుంచి 1105 సర్వే నంబర్ భూమిని సర్వే చేయించి నాకు రావాల్సిన 2.30 ఎకరాల భూమిని విచారించి, సర్వే చేయించి ఆన్లైన్ అడంగల్ లో నమోదు చేయగలరని కలెక్టర్‌ను కోరారు.
3) పాణ్యం మండలం: పాణ్యం మండలం చెందిన మాయకోటి మహేష్ 60 సంవత్సరాల నుండి పాణ్యం గ్రామపచాయతీలోని సర్వే నంబర్ 1367,1371 లలో నా పొలమును సాగు చేసుకుంటూ ఉండగా మా పొలం పక్కన యజమానులు భూమి కొలతలు సర్వే చేయించి నిబంధనలకు విరుద్ధంగా మా పొలమును ఆక్రమించుకున్నారు, అధికారులు స్పందించి పొలం సరిహద్దులు ఉన్న రైతులకు నోటీసు ద్వారా తెలియజేసి కొలతలు వేసి న్యాయం చేయగలరని కోరుతూ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# ప్రజా సమస్యలను సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలి

..పీజీఆర్ఎస్ అర్జీలలో రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులను పూర్తిగా తగ్గించాలి.

..జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 29:**
ప్రజల సమస్యల పరిష్కారంలో సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం యొక్క అత్యంత ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత సేవా ప్రమాణాల (ఎస్ఎల్ఏ) గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా, ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సూచించారు. అలాగే, పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, పూర్తి వివరాలతో, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని తెలిపారు. పెండింగ్ వినతులన్నింటినీ అత్యవసరంగా పరిష్కరించి, ఇకపై ఎలాంటి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, అనురాధ, డి.ఆర్.డి.ఏ రమణా రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సమావేశం



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 29:**నంద్యాల క్రాంతి నగర్ లోని రాయల్ ఫంక్షన్ హాల్లో జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు , నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ వల్లభనేని బాల సౌరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గానికి పరిశీలికులుగా వచ్చానని , పార్టీని బలోపేతం చేయడానికి కమిటీలు వేస్తున్నామని, జనసేన పార్టీతోపాటు కూటమి పార్టీలని బలోపేతం చేసుకోవడానికి నంద్యాల పార్లమెంట్లో దాదాపు 27 మంది సాధకులను ఎంపిక చేసామని వారు నేటి నుంచి వచ్చేనెల 5 వ తేదీ వరకు పార్టీలో ఎవరెవరు ఏ ఏ పదవులు రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఆశిస్తున్నారో వారి స్థాయికి తగ్గట్టుగా దరఖాస్తులు స్వీకరించి అన్ని పరిశీలించి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని అనంతరం పవన్ కళ్యాణ్ నిర్ణయించే స్థాయిలని బట్టి వారికి పదవులు ఇస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, రాష్ట్ర శాలివాహన డైరెక్టర్ సుబ్బయ్య, ఉమ్మడి కర్నూలు జిల్లాల కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు, పార్లమెంట్ లోని ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ సమాచార సేకరణ కమిటీ సభ్యులు, నాయకులు , వీర మహిళలు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయనిధి.

-ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూన్ 29:** పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం అని శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి గారు అన్నారు. సోమవారం ఆత్మకూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 35 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందుతుందని అన్నారు.

# పొలాలలోని ట్రాన్స్ఫార్మర్లలో రాగి వైర్లు దొంగతనం చేసిన ముద్దాయిలు అరెస్ట్.

-ముద్దాయిల వద్ద నుండి 83,700/-రూపాయల నగదు 30 కేజీ ల రాగి వైర్లు స్వాధీనం.

-కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంత నాయక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 29:**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శ్రీనివాసరావు మరియు కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. హనుమంత నాయక్ వారి పర్యవేక్షణలో రేవనూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ వా. ధనంజయులు వారి సిబ్బంది మరియు సి సి ఎస్ సి ఐసురేష్ మరియు వారి సిబ్బందికి రాబడి సమాచారం పైన నిన్నటి రోజున అనగా 28. 06.26 న రెవనూర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని వల్లంపాడు - లింగాల గ్రామాల మధ్య ఉన్న వాటర్ ట్యాంక్ వద్ద ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి ఈమధ్య వరుసగా జరిగిన నంద్యాల జిల్లాలో బండిఆత్మకూర్, నంద్యాల తాలూకా మరియు రేవనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్ఫార్మర్ లోని రాగి వైర్ ను దొంగతనాలు చేసిన కేసుల్లో అరెస్టు చేసి వారి వద్ద నుండి రాగి వైరు మరియు నగదును స్వాధీనం చేసుకోవడం జరిగింది.

# నంద్యాల వైద్యుల సేవలు ప్రశంసనీయం.!

**..నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**..నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా వైద్యుల దినోత్సవం.**

**..వైద్య రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను: ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**..వైద్య వృత్తి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసిన డాక్టర్ రవి కృష్ణ.**

**..వైద్యుల దినోత్సవ పురస్కారాల ప్రదానం.**

**..వైద్యుల దినోత్సవ క్రీడా సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతి ప్రదానం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 29:**
ఐఎంఏ నంద్యాల ఆధ్వర్యంలో భారతరత్న, స్వాతంత్ర్య సమరయోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి.రాయ్ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక సూరజ్ గ్రాండ్ హోటల్ సమావేశ మందిరంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా,గౌరవ అతిధిగా ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ పాల్గొన్నారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. డాక్టర్ బి. సి.రాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఐఎంఏ వైద్యుల దినోత్సవ పురస్కారాలను డాక్టర్ తారకేశ్వర రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ సునీత,నీట్ పి.జి. పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించిన డాక్టర్ నెరవాటి గగన్ లకు ఎంపీ అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ వైద్యులు రోగి ప్రాణాలు కాపాడడానికి శాయ శక్తుల ప్రయత్నం చేస్తారని, వైద్యో నారాయణో హరి గా భారత సంస్కృతిలో చెప్పారన్నారు. నంద్యాల వైద్యులు సేవా దృక్పథంతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఐఎంఏ భవన నిర్మాణానికి వైద్యురాలిగా సహకారంఅందజేస్తామన్నారు. రాష్ట్ర వైద్యుల రక్షణ చట్టం సవరించడం, కేంద్ర వైద్యుల రక్షణ చట్టం కోసం, ఏక గవాక్ష విధానంలో ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సరళీకృతం చేయడానికి, వైద్యులు, వైద్య సిబ్బందిపై కేసులు నమోదు చేసే సమయంలో పాటించవలసిన నిర్దిష్ట నిబంధనావళి రూపొందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ దేశంలో 1928లో ప్రారంభించబడిందని ఇప్పుడు 35





రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలలో 1750 బ్రాంచీలలో నాలుగు లక్షల మంది సభ్యులతో ప్రపంచంలో అతిపెద్ద వృత్తి స్వచ్ఛంద సంస్థ ఐఎంఏ అని అన్నారు.దేశంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి కృషి చేస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 100 బ్రాంచ్ లలో ఇరవై మూడు వేల మంది ఐఎంఏ సభ్యులు అటు ప్రభుత్వ రంగంలో, ప్రైవేటు రంగంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని, వైద్య రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.
ఎంపీ డాక్టర్ పై రెడ్డి శబరిని నంద్యాల వైద్యులు ఘనంగా సత్కరించి అభినందించారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులకు,వైద్యుల కుటుంబ సభ్యులకు నిర్వహించిన వివిధ క్రీడా, సంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు,డాక్టర్ మధుసూదన రావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్,నంద్యాల శాఖ మహిళా విభాగ నాయకులు డాక్టర్ నర్మద ,డాక్టర్ నాగమణి, డాక్టర్ హరిత ,డాక్టర్ సునీత, డాక్టర్ లలిత, డాక్టర్ ఆరిఫా బాను అధిక సంఖ్యలో వైద్యులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.

## నంద్యాలలో ఘనంగా ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి గృహ ప్రవేశం.

**..ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 29 :**నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ సమీపంలో గల పార్క్ వద్ద ప్రముఖ న్యాయవాది మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి నూతనంగా నిర్మించుకున్న గృహంలోకి సోమవారం శాస్త్రోక్తంగా గృహప్రవేశం చేశారు. ఈ శుభకార్యానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహంలోకి ప్రవేశించిన తులసిరెడ్డి దంపతులకు మంత్రి ఫరూక్ పుష్పగుచ్చం అందించి, శాలువాలతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కొత్త గృహం వారికి సుఖసంతోషాలను, సిరిసంపదలను ప్రసాదించాలని మంత్రి ఫరూక్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు, న్యాయవాదులు, మార్క్ ఫెడ్ ప్రతినిధులు, సన్నిహితులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని తులసిరెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి ఇంటికి నాణ్యమైన వైద్య సేవలే రెడ్ క్రాస్ లక్ష్యం.

**..“మీ ఇంటికి మీ డాక్టర్“ ప్రాజెక్టు అమలు కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 29:**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “మీ ఇంటికి మీ డాక్టర్“ (మొబైల్ మెడికల్ యూనిట్) ప్రాజెక్టు అమలు కమిటీ సమావేశం నంద్యాల కేసీ కెనాల్ కాంపౌండ్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌లో జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు మరియు ప్రాజెక్టు అమలు కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి రాజకుమారి గణియా అధ్యక్షతన నిర్వహించబడింది.ఈ సమావేశంలో ప్రాజెక్టు ప్రభావాన్ని అంచనా వేయడంతో పాటు, దాని విస్తరణ, సమర్థవంతమైన అమలు కోసం చేపట్టాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన జిల్లా కలెక్టర్, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలు, అవసరమైన మందులు అందించడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. లిమిటెడ్ సంస్థ వారి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్) సహకారంతో అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా 2026 మార్చి 26 నుంచి జూన్ 15 వరకు తొలి మూడు నెలల్లో బండి ఆత్మకూరు మండలంలో మొత్తం 6,472 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు..ప్రతి ఇంటికి నాణ్యమైన ఆరోగ్య సేవలు చేరేలా చర్యలు తీసుకుంటూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి రెడ్ క్రాస్ సంస్థ కట్టుబడి పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రెటరీ వజ్రాల శ్రీకాంత్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, ఫ్యాక్టరీస్ మేనేజర్ నారాయణ రెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ మహబూబ్ బాషా, ప్రాజెక్టు వైద్యులు డాక్టర్ కమల్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ మమతా రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ అరుణకుమారి, ఇతర సభ్యులు, ప్రాజెక్టు సిబ్బంది మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డి ఎ ఇచ్చారు... అరియర్స్ మరిచారు.

**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 29:**
మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు నూతన డి ఏ ను అధికారులు ఇచ్చారు. కానీ ఇంక్రిమెంట్స్, అరియర్స్ మాత్రం మర్చిపోయారని తెలుస్తుంది. మహానంది దేవస్థానంలో పర్మినెంట్ ఉద్యోగులకు రెండు సంవత్సరాల పైనే రావాల్సిన అరియర్స్ ఇంతవరకు విడుదల చేయలేదని సమాచారం. ఉద్యోగుల జీతభత్యాల విషయంలో దేవస్థానం అధికారులు సానుకూలంగా ఉన్న అరియర్స్ విషయంలో ఎందుకు జాప్యం జరుగుతుంది అనేది ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు రెండు సంవత్సరాలు పైనే ఇంక్రిమెంట్లు, డి ఏల అరియర్స్ విషయంలో మాత్రం నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారని విమర్శలు విలువస్తున్నాయి. ప్రభుత్వం/ దేవాదాయ శాఖ లెక్కల అంచనాల ప్రకారం మొత్తం బకాయిలు ఒకేసారి చెల్లించడానికి అవకాశం లేదని విడతలవారీగా బడ్జెట్ సంవత్సరం ప్రారంభం నుండి ముగిసేలోపు మూడు లేదా నాలుగు విడతల్లో అరియర్స్ బకాయిలు విడుదల చేసే విధంగా ఆదేశాలు ఉన్నట్లు ఆలయ వర్గాల బోగట్ట. కానీ దేవస్థానంలో పనిచేసే పర్మినెంట్ అందరి ఉద్యోగుల



జాబితా ఆన్లైన్లో కంప్యూటర్లలో నిక్షిప్తమై ఉంటుంది. దేవాదాయ శాఖ నెట్వర్క్ లో కూడా వీరి జాబితా వెలుగుబడే అవకాశం ఉంది. కానీ కింది స్థాయికి ఇబ్బంది మాత్రం అందరి జాబితాలకు సంబంధించి క్రోడీకరించాలంటే చాలా సమయం పడుతుంది అని జీవోలో పేర్కొన్నట్లు మూడు నాలుగు విడతల్లో అందరి జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నట్లు సమాచారం. వీరందరి సమాచారం సేకరించి అరియర్స్ విడుదల చేయాలంటే చాలా సమయం పడుతుంది అని అరియర్స్ ఫైళ్లను ముందుకు కదిలించడానికి కీలకంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులు తమ తోటి ఉద్యోగులకు, క్రింది సాయి సిబ్బందికి తెలియజేస్తున్నట్టు తెలుస్తుంది. సాధారణంగా మాన్యువల్ గా ఒక్కొక్క ఉద్యోగులకు సంబంధించి రెండు సంవత్సరాల నుండి రావాల్సిన అరియర్స్ బకాయిలు లెక్కించడం, నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు చేరవేయడం సాధ్యమయ్యే పనేనా అని చేతులు ఎత్తేస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. సాధారణంగా ప్రతి ఉద్యోగికి సంబంధించి రావలసిన జీతభత్యాలు అరియర్స్, ఇంక్రిమెంట్లు క్షణాల్లో సంబంధిత శాఖ ఆన్లైన్ లో బటన్ నొక్కితే అందరి బాగోతం బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మరి ఆలస్యానికి కారణంగా ఏమిటి, బడ్జెట్ ఎంత ఉంది, ఎంత వినియోగించాము, ఎందుకు వినియోగించు కోలేకపోయాము, మిగిలిన మొత్తాన్ని ఏం చేయాలి లోటు బడ్జెట్ ఎంత, ఆదాయం ఖర్చులు ఎంత అనేదానిపై ఒక అవగాహన కొస్తే ఎలాంటి సమస్యలు ఉండవని అంతా సవ్యంగా సాగుతుందని సమాచారం. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల్లో ఏముంది ,ఆ ఆదేశాలు ఎంతవరకు అమలు అవుతున్నాయి అనేది తెలియాల్సి ఉందని ఆలయ ఉద్యోగుల్లో గుసగుసలు వినవస్తున్నట్లు తెలుస్తుంది.

## నంద్యాలలో ఘనంగా ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి గృహ ప్రవేశం.

**..ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్. -ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే లు గౌరు చరితారెడ్డి,బుడ్డా రాజశేఖరరెడ్డి.**










**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 29:**నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ సమీపంలో గల పార్క్ వద్ద ప్రముఖ న్యాయవాది , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి నూతనంగా నిర్మించుకున్న గృహంలోకి సోమవారం శాస్త్రోక్తంగా గృహప్రవేశం చేశారు. ఈ శుభకార్యానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహంలోకి ప్రవేశించిన తులసిరెడ్డి దంపతులకు మంత్రి ఫరూక్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



ఈ కొత్త గృహం వారికి సుఖసంతోషాలను, సిరిసంపదలను ప్రసాదించాలని మంత్రి ఫరూక్ ఆకాంక్షించారు.ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే లు గౌరుచరితారెడ్డి,బుడ్డా రాజశేఖర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు,భూమా జగత్ విఖ్యాత రెడ్డి,ఇరిగేల రామ్ పుల్లా రెడ్డి,ఇరిగేల సూర్యనారాయణ



రెడ్డి,మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తో పాటు జడ్జిలు,న్యాయవాదులు పలువురు రాజకీయ ప్రముఖులు, న్యాయవాదులు, మార్క్ ఫెడ్ ప్రతినిధులు, సన్నిహితులు ,రెవెన్యూ అధికారులు స్థానిక ప్రజలు పాల్గొని తులసిరెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గృహప్రవేశంతో పాటు ఈ రోజు తులసిరెడ్డి పుట్టినరోజు కావడంతో పలువురు అభినందనలు తెలిపారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 30 జూన్ 2026

# నంద్యాల ఆర్ఏఆర్ఎస్ కేంద్రంలో ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు.!

..రైతులు మెరుగైన దిగుబడిపై దృష్టి సారించాలి.

..భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వాడాలి.

..రైతులందరూ వర్షాభావ పరిస్థితులను బట్టి పంటలు వేయాలి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 29:**
నంద్యాల కలెక్టరేట్‌లోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ న్యాయశాఖ మంత్రివర్యులు శ్రీ ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు.
సోమవారం నాడు నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వారు శ్రీ నున్నా వెంకటేశ్వర్లు మరియు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జయ లక్ష్మి గార్ల ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో న్యాయ శాఖ మంత్రి వర్యులు ఫరూక్ నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి వర్యులు నాగలి పట్టి దుక్కి దున్ని రైతులతో మాట్లాడుతూ.. ఏరువాక పౌర్ణమి రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ఈ ఖరీఫ్ సీజన్ రైతులకు సిరిసంపదలను అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా రైతులకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. వర్షాలు బాగా పడి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు ఈ సంవత్సరం ఎలినో ప్రభావం ఉండడం వలన ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని నీటి ఎద్దడిని తట్టుకునే పంటలు వేసుకోవాలని సూచించారు అదేవిధంగా ఎల్ నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి ఏరువాక పౌర్ణమి సందర్భంగా పూజలో పాల్గొని ఈ సంవత్సరం రైతులు అధిక దిగుబడి మరియు ఆదాయం పొందేలా ప్రార్థించారు అదేవిధంగా వరి వేసే రైతులు ఏలినో ప్రభావం ఉన్నందున ఆరుతల పంటలు వేసుకోవాల్సిందిగా మరియు అంతర పంటలు సాగు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా మాట్లాడుతూ తొలకరి వర్షాలు పడిన వెంటనే 25 నుంచి 30 రకాల విత్తనాలు గల పీఎం డిఎస్ కిట్లను పొలాల్లో చల్లుకొని 45 రోజుల తర్వాత దుక్కి చేసుకోవడం ద్వారా నేలలో భూసారం పెరుగుతుందని తెలియజేశారు. ఈ సంవత్సరం జిల్లా రైతులందరూ వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంటలు



వేసుకోవాలని మరియు భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వాడాలన్నారు, ఈ సంవత్సరం నుండి యూరియా మరియు డిఏపి ఏపీ ఏఐఎంఎస్ అప్లికేషన్ ద్వారా సరఫరా చేయబడుతుందని వాటి ద్వారా రైతు కు వారి పంటకు ఎంత అవసరమో అంతే సరఫరా చేయబడుతుందని తెలియజేసారు. యూరియా అధికంగా వాడడం ద్వారా నేల ఆరోగ్యం దెబ్బతింటుందని, అవసరం మేరకే యూరియా మరియు ణూూ ఎరువులను వాడాలని తెలిపారు. వాటికి ప్రత్యామ్నాయంగా పిల్లి పెసర మరియు జీలుగ వంటి పచ్చి రొట్టె ఎరువులను వేయడం ద్వారా భూమిలో కర్బన శాతాన్ని పెంచి భూసారాన్ని పెంచుతాయని, యూరియా డి ఎ పి స్థానంలో కాంప్లెక్స్ ఎరువులు వాడాలని అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించాలని తద్వారా నేల ఆరోగ్యం కాపాడాలని రైతులకు సూచించారు.
పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లి ఒకే పంట కాకుండా మూడు నుంచి ఐదు పంటలు వేసుకోవాలని తద్వారా రైతు నష్టపోకుండా ఉండగలడని తెలియజేశారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం మనిషి ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ చైర్మన్ హరి బాబు ,జిల్లా వ్యవసాయ అధికారి నున్నా







వెంకటేశ్వర్లు, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ జయ లక్ష్మి ,మార్కుఫెడ్ మేనేజర్ హరినాథ్ రెడ్డి,మండల కన్వీనర్ మునగాల విశ్వనాధ్ రెడ్డి, తులసి రెడ్డి ఎఫ్పీఐ డైరెక్టర్ నరహరి విశ్వనాధ్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ పార్టీ.

..రూ. 5 లక్షల ప్రమాద భీమా పరిహారం అందజేసిన మంత్రి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 29:**
నంద్యాల 29 వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త షేక్ నూర్జహాన్, నూనెపల్లె ఆయిల్ మిల్ సమీపంలో జరిగిన దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి విదితమే. దివంగత నూర్జహాన్ గారికి టిడిపి పార్టీ సభ్యత్వం ఉండటంతో, వారి కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని నంద్యాలలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి ఫరూక్ వెంటనే స్పందించి, అవసరమైన పత్రాలను సేకరించి, యుద్ధ ప్రాతిపదికన మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయానికి పంపించారు . టీడీపీ పార్టీ అధిష్టానం ఈ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి, తక్షణమే రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయలు) ప్రమాద భీమా పరిహారాన్ని మంజూరు చేసింది. ఈ ప్రమాద బీమా పరిహారాన్ని నంద్యాలలోని మంత్రి గారి క్యాంప్ కార్యాలయం నందు మంత్రి ఎన్ఎండి ఫరూక్ షేక్ నూర్జహాన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ ఎల్లప్పుడూ తన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని మంత్రి ఫరూక్ తెలియజేశారు.

# నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో తాటికొండ బుగ్గరాముడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 29:**నంద్యాల తెలుగుదేశం పార్టీ నాయకుడు,రాష్ట్ర మార్కుఫెడ్ డైరెక్టర్,సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి గారి ఆహ్వానం నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు గారు ఆలాగే ఈరోజు పుట్టిన రోజు జరుపుకుంటున్న తులసిరెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి శాలువా, పూలబుకే తో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో ఆయువు ఆరోగ్యాలతో జీవించాలి అని రాబోయే రోజుల్లో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అనుభవించాలి అని ఆ దేవుడిని మనసారా కోరుకుంటూ మరి ఒక్కసారి తులసి రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఘనంగా ధాన్యలక్ష్మి ఉత్సవం.

...ఆదర్శగ్రామం పాండురంగాపురం లో











**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 29:**
నంద్యాల జిల్లా పాండురంగాపురంలోని శ్రీ పాండురంగస్వామి దేవస్థానంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా 'ధాన్యలక్ష్మి ఉత్సవం'ను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (నంద్యాల), శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
రామనామ జపంతో ప్రారంభమైన ఈ ఉత్సవంలో రైతు మహిళలను ధాన్యలక్ష్ములుగా భావించి పసుపు, కుంకుమలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పంటలు సస్యశ్యామలంగా పండాలని ఆకాంక్షిస్తూ రైతులకు గుప్పెడు వడ్లను ప్రసాదంగా పంపిణీ చేశారు. ప్రసాదంగా అందించిన ధాన్యాన్ని రైతులు విత్తనాల్లో కలిపి చల్లుకోవడం ద్వారా పంటతో పాటు ధర్మం, ప్రేమ, సిరిసంపదలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి శ్రీనివాసులు భారతీయ వ్యవసాయ సంప్రదాయాలు, రైతు సంస్కృతిని పరిరక్షించాల్సిన అవసరాన్ని వివరించారు. రైతు కుటుంబాల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు.
కార్యక్రమంలో కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి, పాండురంగాపురం గ్రామ పెద్దలు ఎర్రబోతుల పురుషోత్తం రెడ్డి, కొండా మోహన్ రెడ్డి, కొమ్ము శివనాగిరెడ్డి, గాలి బసిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణ రెడ్డి, రైతులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో.. ఎరువాక పౌర్ణమి వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 29:** పాండురంగాపురం గ్రామంలోని శ్రీ పాండురంగస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ రామకృష్ణ డిగ్రీ & పీజీ కళాశాల (స్వయంప్రతిపత్తి), నంద్యాల వారి ఎన్ఎస్ఎస్, ఎన్సిసి యూనిట్లు మరియు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఎరువాక పౌర్ణమి వేడుకలు సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించబడ్డాయి.
ఈ సందర్భంగా ఎద్దులకు ప్రత్యేక అలంకరణ చేసి, వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అలంకరించిన ఎద్దులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, శ్రీ పాండురంగస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి రైతులు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎరువాక పౌర్ణమి భారతీయ వ్యవసాయ సంస్కృతికి ప్రతీక అని, రైతే దేశానికి వెన్నెముక అని, వ్యవసాయ సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. శ్రీ రామకృష్ణ డిగ్రీ & పీజీ కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... భారతీయ సంస్కృతి, రైతుల కష్టం, వ్యవసాయ సంప్రదాయాల పట్ల విద్యార్థుల్లో గౌరవభావం పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. డీన్ ఆఫ్ అకాడెమిక్స్ శ్రీమతి ప్రగతి మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సేవాభావంతో పాటు గ్రామీణ సంస్కృతి, వ్యవసాయ విలువల పట్ల అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐదుగురు మహిళా రైతులను శాలువాలతో సన్మానించి, ధాన్యాన్ని బహూకరించి వారి సేవలను ఘనంగా గౌరవించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీ జి. రామకృష్ణారెడ్డి, శ్రీ యరబోలు పురుషోత్తమరెడ్డి, శ్రీ కిండా మోహన్‌రెడ్డి, కొమ్ము శివనాగిరెడ్డి , గాధి బసవి రెడ్డి మాట్లాడుతూ, రైతు సంస్కృతి, వ్యవసాయ సంప్రదాయాలను







భావితరాలకు పరిచయం చేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అభినందించి, శ్రీ రామకృష్ణ డిగ్రీ & పీజీ కళాశాల, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు, ఎన్ ఎస్ ఎస్ మరియు ఎన్సిసి యూనిట్ల సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు ఎరువాక పౌర్ణమి ప్రాముఖ్యతను ప్రతిబింబించే సాంప్రదాయ ఎరువాక పాటకు నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రదర్శనకు గ్రామస్థులు, అతిథులు హర్షధ్వానాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, ఎన్సిసి అధికారులు, విద్యార్థి వాలంటీర్లు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు ప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.